ఉగాది కథల పోటీలో రూ. 600/- బహుమతి పొందిన కథ




# తగినచోటు

— జొన్నలగడ్డ రామలక్ష్మి

**ల**క్ష్మీనారాయణ పెద్ద ఆఫీసులో చిన్న ఆఫీసరు ఆఫీసిచ్చిన పెద్ద యింట్లో అతడి చిన్న కుటుంబ ముంటోంది. భార్య, ఇద్దరు పిల్లలు తప్ప బొత్తిగా బాధ్యతలు లేవు. అందువల్ల అతడెంతో వైభవంగా ఉండొచ్చు. కానీ అతడికి వ్యసనాలున్నాయి.

లక్ష్మీనారాయణ రోజూ బారుకు వెడతాడు. సిగ రెట్లు దండిగా కాలుస్తాడు. పేకాడతాడు. నాటకాల్లో వేషాలేస్తాడు.

అతడికున్నవి చిల్లర వ్యసనాలే. కానీ, అతడి నెల జీతంలో వాటి కారణంగా చిల్లర మాత్రమే మిగిలేది.

లక్ష్మీనారాయణ భార్య శాంతకు పెద్ద కోరికలేమీ లేవు. కట్టెల పొయ్యికి బదులు గ్యాసు పొయ్యినీ, చేతికి కనీసం రెండు బంగారు గాజుల్నీ, మెడలో పసుపుతాడుకు బదులు బంగారు నాను తాడునీ, కట్టే సీదాసాదా ఏడాదికి నాలుగైదు సింథటిక్ చీరల్నీ మాత్రం కోరుకునేది. అదీ మనసులోనే! ఆమె నోరు విడిచి భర్తనేదీ అడిగేది కాదు.

పిల్లలు స్కూలుకు వెళ్ళే సమయానికి శాంత నోరు విడవాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. వాళ్ళు మనింట్లో గ్యాసు పొయ్యి లేదేమని ఊరుకోక - చుట్టు పక్కల అందరికీ ఉండే టెలివిజను, రిఫ్రిజిరేటర్ల గురించి కూడా అడుగుతూంటే ఆమె భర్తకు చెప్ప సాగింది.

ముందు లక్ష్మీనారాయణ కోప్పడ్డాడు. పిల్లలికి నువ్వే చెప్పి పెడుతున్నావని నెపం వేశాడు. శాంత అభిమానపడి, "ఇన్నేళ్ళుగా కాపురం చేసినా నా మనసు తెలుసుకోక నన్నే తప్పు పడుతున్నారు. ఇక మీదట వాళ్ళ గురించి నేనేమీ చెప్పను. మీరూ మీరూ చూసుకోండి" అంది.

పిల్లలిద్దరూ తండ్రిని తగులుకుంటే వాళ్ళను నామీదకు నువ్వే ఉసిగొల్పుతున్నావని లక్ష్మీ నారాయణ శాంత మీద మండిపడ్డాడు.

పిల్లలు ఏకకంఠంతో తల్లినేమీ అనడానికి వీల్లే దన్నారు. లక్ష్మీనారాయణ వాళ్ళను కొట్టాడు. కోపం వచ్చి పిల్లలిద్దరూ తిండి మానేశారు. వాళ్ళది మొండి పట్టు కావడంతో లక్ష్మీనారాయణ పితృ హృదయం చలించక తప్పలేదు.

లక్ష్మీనారాయణ చెడ్డవాడు కాదు. అతడికి భార్యా బిడ్డలంటే బోలెడు ప్రేమాభిమానాలున్నాయి. పిల్లల్ని చేరదీసి బుజ్జగించగానే అతడికి వాళ్ళ తెలివితేటలు అర్థమయ్యాయి. వాళ్ళ తెలివికతడికి ఆనందం కలిగింది కూడా!

పిల్లలడిగేది సబబేననీ లోపం పూర్తిగా తనలో ఉందనీ లక్ష్మీనారాయణ గుర్తించాడు. కానీ ఎంత ప్రయత్నించినా తన వ్యసనాలు వదులుకోలేకపోతు న్నాడు. వ్యసనాలు విడిచిపెడితే తన భార్యాబిడ్డలు కూడా నలుగురిలా సుఖపడతారు.

అతడిలో మానసిక సంఘర్షణ ప్రారంభ మయింది. అందువల్ల విస్కీ, సిగరెట్ల డోసు ఇంకా పెరిగింది.

ఒకరోజున మిత్రుడికి లక్ష్మీనారాయణ తన బాధ చెప్పుకుని, "వ్యసనాలు విడిచిపెట్టలేను. నావాళ్ళను సుఖపెట్టాలని కోరికగా ఉంది" అన్నాడు.

"నీ సీటు బ్రహ్మాండమైనది. కాస్త వదులుగా ఉండు. ఈ ఊరినే కొనేయొచ్చు" అన్నాడు మిత్రుడు.

"నా ప్రాణం పోయినా నిజాయితీని, నీతినీ వదిలి

పెట్టను. వ్యసనాలు నా బలహీనత. అందుకని ప్రజలకు జరిమానా విధించలేను" అన్నాడతడు.

"అయితే ఇంకో ఉపాయముంది. లక్ష రూపాయలకు జీవితాన్ని భీమా చేయి. నెలనెలా భీమా వాయిదా క్రింద డబ్బు అదా అవుతుంది. ఆ మేరకు నీ వ్యసనాల ఖర్చులు తగ్గుతాయి" అన్నాడు మిత్రుడు.

ఆ మిత్రుడు భార్య పేరున భీమా ఏజెన్సీ తీసుకున్నాడు. అందుకే ఆ సలహా యిచ్చాడేమోనని అనుమానించక లక్ష్మీనారాయణ ఇన్సూరెన్సు పాలసీ తీసుకున్నాడు. భీమా ప్రీమియమ్ము నెల నెలా జీతంలోంచి తీసుకునేలా ఆఫీసులో కాగితం రాసిచ్చాడు.

ఇప్పుడు లక్ష్మీనారాయణ మనసుకు కొంత తృప్తిగా ఉన్నప్పటికీ అది తాత్కాలికమే అయింది.

అతడు వ్యసనాలనే మాత్రమూ తగ్గించుకోలేక, పోయాడు. తెచ్చే జీతం అన్నింటికీ చాలక ఇంట్లో చిరాకు పడడం ఎక్కువయింది. క్రమంగా అప్పులు ప్రారంభించాడు. అవి తీర్చడం కష్టంగా ఉంది అతడికి మనశ్శాంతి కరువయింది. దాంతో మరింతగా వ్యసనాలకు బానిక అయ్యాడు.

తలకు మించిన అప్పులతో ఎన్నాళ్ళు సాగుతుంది?

లక్ష్మీనారాయణపై ఒత్తిడి ప్రారంభమయింది.

చివరకు అవినీతికి పాల్పడడం తప్ప వేరే దారి అతడికి కనబడలేదు.

లక్ష్మీనారాయణ నీతి, నిజాయితీలను మనస్పూర్తిగా నమ్మాడు. అవి అతడి రక్తంలో భాగమై ప్రవహిస్తున్నాయి.

కానీ,... ఇక తప్పదు....

వ్యక్తిగత జీవితంలోని బలహీనతలు ఆఫీసు జీవితంలో తనను నైతికంగా దిగజార్చబోతున్నాయి.

లక్ష్మీనారాయణ ఒక పార్టీకి ఫలానా రోజున రమ్మని మాటిచ్చాడు. ఆ పార్టీ రేపు వస్తాడనగా ఈ రోజు రాత్రి అతడు మరణించాడు.

అది అత్మహత్య అని కొందరంటారు. గుండె నొప్పి వచ్చిందని కొందరంటారు. ఏది ఏమైనా బలహీనలతణ్ణి హత్య చేశాయన్నది నిజం!

అప్పుడు శాంతకు ముప్పై ఏళ్ళు కూడా ఉండవు. కొడుకులిద్దరికీ పదేళ్ళలోపే!

భర్తనే నోరు విడిచి ఏమీ అడగడం చేతకాని ఆమె ఈ సమాజాన్నించి ఏమడిగి సాధించగలదు?

ఆమె భర్త ఫోటోకు ఫ్రేం కట్టించి దేవుడి పక్కనే తగిలించి, "మీరక్కడ, నేనిక్కడ - ఎలా బ్రతకమంటారు?" అని ఏడ్చేది.

శాంతకు నోరు లేకపోయినా సభ్య సమాజంలో కొన్ని మర్యాదలున్నాయి. ఆమెపైన జాలితో అప్పుల వాళ్ళు బాకీ వదులుకున్నారు.

ఆమె అడక్కపోయినా ఆఫీసువాళ్ళు తలా కొంత పైకం వేసుకుని వసూలు చేసి ఆమెకిచ్చారు. భర్త పెన్షను ఆమెకు త్వరగా అందే ఏర్పాటు చేశారు. అంతే కాకుండా రూల్సు పుస్తకాలు తిరిగేయించి ఆమె అర్హతలకు తగ్గ ఉద్యోగాన్ని ఆ ఆఫీసులోనే వేయించారు. ప్రావిడెంట్ ఫండు డబ్బులు కూడా ఆమెకు అందాయి.

ఈలోగా ఇన్సూరెన్సు లక్ష రూపాయలూ ఆమె చేతికి అందాయి.

రోజులు గడుస్తున్నాయి.

కుటుంబంలో ఒక్క మనిషి తగ్గిపోతే ఆదాయం అంత ఎక్కువగా ఎందుకనిపిస్తుందో శాంతకు అర్థం కావడం లేదు.

ఆమెకిప్పుడు గ్యాసు పొయ్యి, కలర్ టి.వి., రిఫ్రిజిరేటరు అన్నీ ఉన్నాయి. పిల్లలినామె పెద్ద చదువు చదివించాలనుకుంటోంది. పిల్లలు కూడా బుద్ధిమంతులు. తెలివైనవారు.

పెద్దవాడు ఎం.బి.బి.యస్. పూర్తిచేసి ఉద్యోగంలో చేరాడు. చిన్నవాడు ఇంజనీరింగు పూర్తిచేసి ప్రయివేటు కంపెనీలో అపాయింట్‌మెంటు ఆర్డరందుకున్నాడు.

శాంతకు అంతా ఆశ్చర్యంగా ఉంది. ఆమె పిల్లలిద్దర్నీ భర్త ఫోటో వద్దకు తీసుకుని వెళ్ళి, "ఈరోజు మీరు మావక్కన వుంటే ఎంత బాగుండేది?" అంది కళ్ళు తుడుచుకుంటూ.

ఉన్నట్లుండి ఫోటో నోరు విప్పి పలికింది.

"వెర్రిదానా! మీ అందరి బాగూ నేనిక్కడుండడంలోనే ఉంది. నాకు తగిన చోటు మీ పక్కన కాదు. ఇక్కడే!"

శాంత ఉలిక్కిపడింది. తన భర్త నిజంగా అలా మాట్లాడాడా? లేక ఆ భావం తన మనసులో ఉందా?

విషయమేమైతేనేం నిజం నిజం కాకపోదు. □

